# రామనామస్మరణ చేస్తే రాగ,రోగములంటవు

*చక్కెరకంటె తీపి దధిసారము కంటెను రుచ్యమౌను పెం*
*పెక్కిన తేనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా*
*మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్*
*చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్!*

వేదము అనంతమైనది, అసమానమైనది, అద్వితీయమైనది. వేదసారమే రామాయణము. మానవాళికి ఆదర్శమునందించే నిమిత్తం ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములు నాలుగూ రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులనే నాల్గు రూపాలను ధరించి ఈ భౌతిక జగత్తులో సంచరిస్తూ వచ్చాయి. ఋగ్వేదము మంత్రస్వరూపము. రాముడు ఋగ్వేదస్వరూపుడై ప్రజలను పరిపాలిస్తూ వచ్చాడు. రాముడే తన జీవితాధారమని భావించి లక్ష్మణుడు ఎల్లప్పుడు రాముని వెంట జంట నిలిచి, రాముని అడుగు జాడలను అనుసరిస్తూ వచ్చాడు. మంత్ర స్వరూపుడు రాముడైతే మంత్రద్రష్ట లక్ష్మణుడైనాడు. భరతుడు రామనామమనే నిర్గుణ స్వరూపమును ఆధారం చేసుకొని, 14 సంవత్సరాలు రామచింతన చేస్తూ వచ్చాడు. రామనామమే తన జీవితాధారమని విశ్వసించి, సర్వులకూ బోధించి, తాను ఆచరించి ఆనందాన్ని అనుభవించాడు. కాబట్టి, లక్ష్మణుడు సగుణోపాసకుడు, భరతుడు నిర్గుణో పాసకుడు. ఇక, శత్రుఘ్నుడు తన ఇంద్రియాలను జయించి, రామ, లక్ష్మణ, భరతుల ఆజ్ఞలను శిరసావహిస్తూ, తన కాలమునంతా వారి సేవలకే అంకితం గావించాడు.

**నాల్గువేదములే రామ,లక్ష్మణ, భరత, శత్రుఘ్నులుగా అవతరించాయి**

రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నుల ఆదర్శాలను ప్రపంచానికి బోధిస్తూ, వారు సాక్షాత్తు వేదస్వరూపులని లోకానికి చాటిచెప్పారు వసిష్ఠ విశ్వామిత్రులు. దశరథ మహారాజు యొక్క పుణ్యఫలముచేతనే వారతని గృహమునందు జన్మించారని పేర్కొన్నారు. విశ్వామిత్రుడు తన శిష్యులకు వేదములను గురించి ప్రబోధిస్తూ "నాయనలారా! నాల్గు వేదములూ దశరథ మహారాజు పిల్లలైనటువంటి రామ,లక్ష్మణ, భరత, శతృఘ్నులుగా అవతరించి, లోకానికి ఆదర్శాన్ని అందిస్తున్నాయి" అని చెబుతూ వచ్చాడు. కనుక వేదములు నిర్గుణ స్వరూపములు కావు, సగుణస్వరూపములే! ఏమిటా స్వరూపములు? ఋగ్వేదమే రాముడు, యజుర్వేదమే లక్ష్మణుడు, సామవేదమే భరతుడు, అధర్వణవేదమే శత్రుఘ్నుడు. భరతుడు రామపాదుకలను ప్రమాణంగా పెట్టుకొని, నందిగ్రామములో ఒక ఆశ్రమమును నిర్మించుకొని, భావ, రాగ, తాళయుక్తంగా నిరంతరం రామనామాన్ని గానము చేస్తూ వచ్చాడు. కాబట్టి భరతుడు సామవేదమునకు ప్రతీక.

రాముడు ఋగ్వేదస్వరూపుడు. ఋగ్వేదము మంత్రస్వరూపము. ఈ మంత్రమునే ఆధారం చేసుకొని లక్ష్మణుడు రామసేవ చేసుకుంటూ వచ్చాడు. తన తల్లీ తండ్రీ గురువూ దైవమూ రాముడే అని భావించి రామసేవలో కాలాన్ని సార్థకం గావించుకున్నాడు. రామ నామమే తారకమంత్రమని భావించాడు. కనుక రామాయణ మనేది సామాన్యమైన కథ కాదు. ఇది సాక్షాత్తు వేదప్రమాణము. వేదసారమైన రాముడు బ్రహ్మజ్ఞాన మనే సీతను వరించాడు. చెఱకు లోపల తీయని రసము ఉంటుంది. రసము లేనిది చెఱకు కాదు. అట్లే నామము, జ్ఞానము ఈ రెండింటిమధ్య అవినాభావ సంబంధమున్నది. కనుకనే, జ్ఞానమును నామముతో చేర్చాలని హనుమంతుడు దీక్షపూనాడు. అదియే రామరసము. ఈ సారమును గ్రోలినవాడు, అనుభవించినవాడు హనుమంతుడు.

## వేదమంత్రాలు రాక్షసత్వాన్ని అణచివేయగల శక్తిస్వరూపాలు

త్రేతాయుగములో ఋషులు రామనామమును స్మరించుకుంటూ వచ్చినప్పుడు రాక్షసులు వారికి అనేక విధాలుగా ఆటంకాలు కల్పించారు. భగవన్నామమును స్మరించే వారిని నిరంతరం రాక్షసులు వెంటాడుతూనే ఉంటారు. కొన్ని నిమిషాలు 'రామా! రామా!' అని స్మరించేటప్పటికి రాక్షసులు వచ్చి ఆ రామనామాన్ని మరపింపజేయటానికి ప్రయత్నిస్తారు; యజ్ఞయాగాది క్రతువులకు అడ్డు తగులుతుంటారు. కనుకనే, విశ్వామిత్రుడు తన యాగ సంరక్షణార్థం రామలక్ష్మణులను గొనిపోయాడు. రామలక్ష్మణులు రాక్షసులతో పోరాడి విజయాన్ని సాధించారు. వేదమంత్రాలు మానవుని లోపలున్న రాక్షసత్వాన్ని బయటికి లాగి పారవేయగల శక్తిగల్గినవని ఈ ఘట్టము నిరూపిస్తోంది. రాక్షసత్వాన్ని అణచి, దైవత్వాన్ని అభివృద్ధి పరచి, లోకానికి శాంతి చేకూర్చటానికి రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు కంకణం కట్టుకున్నారు.

నాల్గు వేదములే ఈ నాల్గు స్వరూపాలను ధరించి లోకానికి శాంతి చేకూర్చాయి. కాబట్టి, ఇవి కేవలం మంత్ర స్వరూపములు కావు, సాకార స్వరూపములే! అట్టి ఆకారములనే దైవ స్వరూపములుగా భావించి ఆ త్రేతాయుగమునందు మంత్రతంత్రములను అభివృద్ధిపరుస్తూ వచ్చారు. కాని, యుగములు మారే కొలదీ మానవుని ప్రవర్తనలు మారుతూ వచ్చాయి. ఈనాటి మానవునికి మంత్ర స్వరూపమే తప్ప సాకారతత్త్వము జతగా రావటం లేదు.

ఒక్కొక్క మంత్రమునకు ఒక్కొక్క ఆకారము ఉంటున్నది. ఒక్కొక్క మంత్రమునకు ఒక్కొక్క అంతరార్థము ఉంటున్నది. ఇట్టి తత్త్వమును గుర్తించి వర్తించినప్పుడే రాక్షసత్వాన్ని దూరం చేయటానికి తగిన పటుత్వము చేకూరుతుంది.

కలిలో నామస్మరణయే తరణోపాయం

"వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" తమస్సుకు ఆవలనున్న మహా తేజోవంతుడైన పరమాత్మను తాము దర్శించామని మన ప్రాచీన ఋషులు చాటుతూ వచ్చారు. అట్టి దివ్యత్వాన్ని ద్వాపరయుగములో యోగులు తమ హృదయములో చిత్రించుకొని యజ్ఞయాగాది క్రతువులను ఆచరిస్తూ వచ్చారు. దేవతా చిత్రములను ఆరాధన చేసుకుంటూ శాంతిని పొందుతూ వచ్చారు. ఎక్కడ మంత్రమో అక్కడ ఆకారము. అక్కడే తంత్రము కూడా. అట్టి మంత్ర యంత్ర తంత్రముల చేత దైవారాధన చేస్తూ శాంతిని అనుభవిస్తూ వచ్చారు. కాని, ఈ కలియుగమునందు మానవుడు దైవత్వాన్ని పూర్తిగా విస్మరించటం చేత ఇది కలహాయుగంగా మారిపోయింది. ఒకే తల్లికి పుట్టిన బిడ్డల మధ్య కూడా కలహములు, ద్వేషములు బయల్దేరుతున్నాయి. ఇటువంటి కలహాయుగమునందు దివ్యత్వాన్ని సాక్షాత్కరింప జేసుకోవటానికి తగినంత శక్తి సామర్థ్యములు మానవునియందు లేకపోవటం వలన పెద్దలు భగవన్నామస్మరణ చేయమన్నారు. ఈ కలియుగమునందు నామస్మరణయే తరణోపాయం. మానవాళి తరించటానికి ఒక్కొక్క యుగములో ఒక్కొక్క సాధన నిర్దేశింపబడింది. కృత యుగమున ధ్యానము, త్రేతలో యజ్ఞము, ద్వాపరమున అర్చన, కలిలో నామస్మరణ అని చెప్పారు.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా

ఏ నామస్మరణ? రామనామస్మరణ చేయాలి. రామ నామము అన్ని యుగములందు ప్రమాణపూర్వకమైనది. త్రేతాయుగమునందు ఋషులు రామనామమును స్మరిస్తూ రావటంచేతనే రాక్షసత్వము నిర్మూలింపబడి, దైవత్వము అభివృద్ధి అవుతూ వచ్చింది.

## రామనామము శైవులకూ వైష్ణవులకూ ప్రాణ సమానమైన మంత్రము

'రామ' అనే రెండక్షరములలో ఎంతో పవిత్రమైన తత్త్వము ఇమిడి ఉన్నది. రామాయణ సారమంతా రామనామములోనే ఉన్నది. రామాయణమునందు కొన్ని వేల శ్లోకములున్నాయి. ఇన్ని వేల శ్లోకములను పఠించటం ఎవరి తరము? కనుకనే, ఋషులు రామనామాన్నిస్మరిస్తే చాలన్నారు. ఈ కలియుగంలో నామస్మరణ కంటే మించిన తరణోపాయం లేదన్నారు. ఇవి రెండే రెండు అక్షరములు – 'రామ' ఈ రెండక్షరాలను హృదయపూర్వకంగా స్మరిస్తే చాలు. రామనామమును స్మరించినవారికి రోగముగాని, రాగముగాని అంటవు. ఇది శైవులకూ వైష్ణవులకూ ఇరువురికీ ప్రాణసమానమైన మంత్రము. ఏవిధంగా? "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మంత్రమునకు రకారము ప్రాణ సమానము. ఈ ఎనిమిదక్షరములలో 'రా' అనేది తీసివేస్తే.... "ఓం నమో నాయణాయ".... అది ప్రాణం లేని మంత్రమవుతుంది. అట్లే "నమశ్శివాయ" అనే పంచాక్షరీ మంత్రమునకు మకారము ప్రాణ సమానము. అందులో నుండి 'మ' అనే అక్షరాన్ని తీసివేస్తే.... "నశ్శివాయ"... అది అమంగళకరమైపోతుంది. అష్టాక్షరీ మంత్రములోని రకారము, పంచాక్షరీ మంత్రములోని మకారము ఈ రెండూ కలసినదే రామనామము. కనుకనే, త్రేతాయుగము నుండి నేటి వరకు రామనామమునకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ వచ్చారు.

*రామనామమను మిఠాయి ఇదిగో, రండి భక్తులారా!*
*భూమిలో దొరుకు మిఠాయిని తిని తిని*
*పామరులై చెడిపోకండి!*
*వేదసారమను గోధుమపిండిలో*
*వేదవాక్యమను క్షీరము పోసి*
*ఆనందమను పెద్ద భాండము తీసి*
*ఆది మునులు దీని బాగుగ కలిపిరి*
*రామనామమను మిఠాయి ఇదిగో, రండి భక్తులారా!*

*నిబద్ధియను కండచక్కెర దెచ్చి*
*సుబుద్ధియను ఆవు నెయ్యే వేసి*
*అబద్ధమనియెడి మలినము తీసి*
*ఆదిమునులు దీని పాకము బట్టిరి*
*రామనామమను మిఠాయి ఇదిగో, రండి భక్తులారా!*

ఈనాడు ఇట్టి పవిత్రమైన మిఠాయిని స్వీకరించక, దివ్యమైన రామరసమును గ్రోలక లోకసంబంధమైన మిఠాయిలను తిని 'డయాబెటిసు పేషంట్సు'గా తయారవుతున్నారు మానవులు. ఆ రోగాన్ని పోగొట్టుకునే నిమిత్తమై 'ఇన్సులిన్' వాడుతున్నారు. మందులు తీసుకుంటున్నారు. సాధారణంగా పెళ్ళిళ్ళలోనూ, ఇతర శుభకార్యాలలోనూ తట్టనిండుగా స్వీట్లు తెచ్చి వడ్డిస్తుంటారు. కాని కొందరు 'మాకొద్దు, మాకొద్దు' అంటుంటారు. ఎందుకోసం? వారికి తీపి ఇష్టము లేక కాదు. వారిలో 'డయాబెటిసు' రోగము ప్రవేశించింది కనుక తమకు మిఠాయి వద్దంటున్నారు. అయితే రామ నామమనే మిఠాయి రోగనివారణ గావించే నిమిత్తం వచ్చిందేగాని, రోగములు కల్పించేకోసం వచ్చింది కాదు. ఇటువంటి పవిత్రమైన, వేదసారమైన రామ నామమును ఈనాటి మానవుడు విస్మరిస్తున్నాడు.

ప్రాచీనకాలములో పశువుల కాపరి మొదలుకొని పండితుని వరకు ప్రతి ఒక్కరూ రామనామమును స్మరిస్తూ ఉండేవారు. కనుకనే, ఆనాడు ఇన్ని రోగములు ఉండేవి కావు. దైవనామమే వారిని అన్ని రోగముల నుండి

కాపాడుతూ వచ్చింది. ఏనాడు భౌతికమైన, లౌకికమైన భావములను విసర్జిస్తామో ఆనాడే ఈ భౌతికరోగము నివారణ అవుతుంది. ఈ భవరోగాన్ని నివారణ గావించే నిమిత్తం రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు ఎన్నియో ఆదర్శములను ప్రబోధిస్తూ వచ్చారు. భౌతికరోగాలకు మూలకారకులు రావణ, కుంభకర్ణులు. కుంభకర్ణుడు మితిమీరిన తిండికి ప్రతీక. తాను ఎప్పుడూ తింటూనో, లేక నిద్రిస్తూనే ఉండేవాడు. విభీషణుడు మాత్రం నిరంతరం రామనామాన్ని స్మరిస్తూ వచ్చాడు.

పతికి హితము బోధించటం సతి కర్తవ్యం

రావణుడు నిజంగా రాక్షసుడు కాదు. అతను అనేక యజ్ఞయాగాది క్రతువులనాచరిస్తూ వచ్చాడు. కాని, కామక్రోధాది దుర్గుణాలకు లొంగిపోవటంచేత అతనిలో రాక్షసత్వం ప్రవేశించింది. ఆ దుర్గుణాలను దూరం చేసుకోవలసిందిగా అతని భార్య మండోదరి ఎంతగానో హితబోధ చేస్తూ వచ్చింది.

*భర్త దుర్మార్గుడై కీడు బడయు వేళ*
*మంత్రి యట్టుల మేల్ కీడు మనవి జేసి*
*పతికి హితము గఱుపగా పడతులెపుడు*
*నడువవలెను మండోదరి యట్లు భువిని*

భార్య అనగా కేవలం భౌతికమైన ఆనందమునిచ్చేది కాదు. పతి పెడమార్గము పట్టినప్పుడు అతనికి హితబోధలు చేసి సన్మార్గములో, దైవతత్త్వములో ప్రవేశ పెట్టటం సతి కర్తవ్యం. ఈనాడు భార్యను పనికత్తె మాదిరి చూస్తున్నారు. చాలా పొరపాటు. పతికి హితము బోధించే నిమిత్తమై సతి వచ్చింది. సీత కూడా రామునికి ఎన్నియో హితబోధలు చేసింది "స్వామీ! పాపములు చేసినవారు ఏదో కొంతమంది మాత్రమే ఉంటున్నారు. కాబట్టి, రాక్షసులందరినీ చంపటం మంచిది కాదు. ఎవరు తప్పు చేశారో వారిని సరిదిద్దటం న్యాయం" అని చెబుతూ వచ్చింది.

**గుణము గలవాడే పురుషుడు**

స్త్రీలు చాలా గొప్పవారు, పురుషులకు సరియైన మార్గము బోధించే హక్కు గలవారు. స్త్రీల యొక్క ప్రోద్బలముచేతనే, వారి యొక్క దివ్యశక్తులచేతనే పురుషులు అభివృద్ధికి వచ్చి లోకాన్ని రక్షిస్తూ వచ్చారు. పురుషుడంటే ఎవరు? గుణము గలవాడే పురుషుడు. రామాయణమునందు కూడా రాముని గుణమునే ప్రధానంగా తీసుకున్నారు. బలము కలిగినంత మాత్రమున పురుషుడు కాదు. క్రోధ, మోహది దుర్గుణములు కలిగినవాడు పురుషుడు కాదు, వానిని పశువనే చెప్పవచ్చును. లోకములో మంచి చెడ్డలు రెండూ ఉంటున్నాయి. మనం మంచిని మాత్రమే గ్రహించి, చెడ్డను విసర్జించాలి. ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు తమ గుణములను, ప్రవర్తలను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టుకోవాలి. విద్యార్థినీ విద్యార్థులు ఉత్తములుగా రూపొందినప్పుడే దేశము సుభిక్షంగా వర్ధిల్లుతుంది. ఎక్కడికి పోయినా మనకు గుణమే ప్రధానము. గుణము కలిగినవారు ఎక్కడున్నా గొప్పవారే! గొప్పతనము గుణములోనే ఉన్నదిగాని, ధనములో లేదు.

దృష్టి, వాక్కు, శ్రవణములను సక్రమంగా పెట్టుకోండి

విద్యార్థులారా! చదువుకున్నామని విఱ్ఱవీగకండి. చదువుకోవటమే గొప్పతనమని భావించకండి.

చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి ఏరీతినున్నను
హీనుడవగుణంబు మానలేదు

*తరచి చదువు చదువ తర్కవాదమెగాని*
*పూర్ణజ్ఞానమెపుడు పొందలేదు*
*చదువు చదివి చదివి చావంగనేటికి?*
*చావు లేని చదువు చదువవలయు*

మనం పూర్ణజ్ఞానములో ప్రవేశించాలి. పరిపూర్ణమైన గుణమును పోషించుకోవాలి. మన దృష్టిని, వాక్కును, శ్రవణమును సక్రమముగా పెట్టుకోవాలి. మీకిచ్చిన పంచేంద్రియాలలో ముఖ్యంగా కన్నులు, చెవులు, నాలుక ఈ మూడింటినీ కంట్రోలు చేసుకుంటే మీరు గొప్పవారైపోతారు. మంచి చూపు, మంచి వినికిడి, మంచి పలుకులు... ఈ మూడింటినీ పోషించుకుంటే మీకంటే వేరే దైవము లేదు. ఈ మూడు గుణములు గలవాడు సాక్షాత్తు దైవస్వరూపుడే! కాబట్టి, మీ తలంపులను మంచివిగా పెట్టుకోండి. మీ దృష్టి, శ్రవణములను కూడా మంచివిగా పెట్టుకోండి. అదే మీరు చదివిన చదువుకు సార్థకత. మానవత్వానికి మూలాధారమైన ఈ మూడింటినీ సన్మార్గములో పెట్టుకున్నప్పుడు మీ జీవితమే రామాయణముగా రూపొందుతుంది. ఈ మూడింటినీ పోషించే నిమిత్తమై వేద, శాస్త్ర, ఇతిహాస, పురాణములంతా ఏర్పడ్డాయి. నాల్గువేదములూ మనిషిని ఉద్ధరించేందుకే వచ్చాయి.

విద్యార్థులారా! వేదాన్ని అలక్ష్యం చేయకండి. వేదములో ఏది తెలిసినా అది మనస్సులో పెట్టుకోండి. వేదప్రబోధలను గుర్తించి వర్తించినప్పుడే మానవుడు మానవుడుగా జీవించగలడు; లేకపోతే తాను రాక్షసుడుగా రూపొందుతాడు.

("రామ రామ రామ సీతా..." అనే గీతముతో శ్రీవారు తమ దివ్యోపన్యాసమును ముగించారు)

(2004 మార్చి 30వ తేదీ ఉదయం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)